# 13. కీడా? మేలా?

విసుగు నెరుగని విక్రమార్కుడు మళ్ళీ మర్రిచెట్టు ఎక్కి శవాన్ని భుజాన వేసుకొని నడక సాగించాడు.

శవాన్ని ఆవహించిన భేతాళుడు "రాజా! ప్రపంచంలో ఏది మానవునికి మేలు చేసేది, ఏది కీడుచేసేది అనేదాన్ని స్థూలంగా సూటిగా చెప్పలేము. నీవు నిర్వహించే ఘనకార్యపు ఉద్దేశమేమిటో నాకు తెలియదు: కాని దాని ఫలితాన్నిబట్టే చేసినపని సక్రమమైనదో, అక్రమమైనదో నిర్ణయించుకోవాలి. వెనుకటికి ఇందుమతి అనే ఇల్లాలి కాపరం పూర్తిగా నేలపాలు కాకుండా కాపాడబడిన సంఘటనల కథాక్రమాన్ని వివరిస్తాను. నీకు శ్రమలేకుండా ఉండేందుకుగాను యీ శృంగారగాథ చెపుతాను- విను" అని కథ చెప్ప నారంభించాడు:

గుంటూరు పట్టణంలో రామనాథమనే ప్లీడరు ఉండేవాడు. క్రిమినల్ కేసుల్లో అందెవేసిన చేయిగా అతను ప్రసిద్ధి కెక్కాడు. ఒక పెద్దమేడా, భూములు మొదలైనవి స్వార్జితం నుంచే కొన్నాడు. తొందరపడి పెళ్ళి చేసుకుంటే, సంసారం పెరిగి, తన సంపాదనకు ప్రతిబంధక మవుతుందని తనకు ముప్ఫయిఐదో పడి వొచ్చేదాకా ఆగాడు.

కాని యవ్వనం దాస్తే - డబ్బులాగు చక్రవడ్డీ లొచ్చి పెరిగేది కాదు: దాన్ని సక్రమంగా ఉపయోగించినా, ఉపయోగించకున్నా కాలంతోపాటే హరించుకొని పోతుంది. చాలా ఆలస్యంగానే యీ సిద్ధాంతాన్ని కనుగొన్న రామనాథం ఇంకా తాత్సారం చేసి ఘోరమైన సమస్యను ఘోరతరం చేసుకోరాదనే నిశ్చయానికి వొచ్చాడు.

త్వరలోనే మంచి సంబంధం కుదిరింది. ఇందుమతి కాలేజి విద్యార్థిని; పెద్దింటి పడుచు. పద్దెనిమిదేళ్ళ నవయవ్వని. రూపలావణ్యాలకేమీ లోటు లేదు. ఎటొచ్చీ దంపతులమధ్య ఉండే వయోభేదం ఒక్కటే ప్రతిబంధకంగా, కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

ఐతే అన్ని విషయాల్లోనూ సరిసమానత్వం ఉండే దాంపత్యాలు ప్రపంచంలో సాధ్యం కానివి. ఏదో వొక లోపం- ఎగుడు దిగుడు తప్పదు. ఏదో విధంగా సరిపెట్టుకోవట మొక్కటే మార్గం. ఈ సత్యం తెలిసిన పెళ్ళిపెద్దలు నిరాటంకంగా, రామనాథం చేత ఇందుమతికి మూడుముళ్ళూ వేయించారు.

ఇందుమతి మొదట్లో కించపడినా - వరుని తెలివితేటలూ, చదువు సంస్కారాలూ, హోదా మొదలైనవి చూసి మురిసిపోయింది. ఇక దాంపత్యసౌఖ్యం మాటకు వొస్తే - తన చాతుర్యంతో పురుషత్వాన్ని రెచ్చగొట్టి, మూసలో కరిగించి, తనకు కావలసిన విధంగా రూపొందించుకునే పనితనాన్ని- ప్రకృతే, స్త్రీకి ప్రసాదించిన దాన్ని- ప్రయోగించి విజయాన్ని సాధించవొచ్చని తనకు తాను సరిపెట్టుకొన్నది.

మొదట్లో ఆమె సిద్ధాంతాలు సులభంగానే ప్రయోగాత్మకంగా విజయాన్ని సాధించినవి. ఐతే పీల్చినకొద్దీ సంసారంలోని సారం అంతరిస్తుందనే సూచనల్ని భర్త ప్రదర్శించసాగాడు.

ఇందుమతి కింకా దాంపత్యాపేక్ష తరగలేదు సరికదా పెరుగుతూంటే, తనవల్ల కాదనీ, తనకు ఇంతకన్న ముఖ్యమైన పను లున్నవనే ధోరణిని రామనాథం ప్రదర్శించసాగాడు.

ఇందుమతి తన శృంగార చాతుర్య ప్రదర్శనను ద్విగుణీకృతం చేసినప్పటికీ, ఆశించిన ఫలం ఆమెకు దక్కటంలేదు. పగలల్లా కోర్టుగొడవలతో అలసి సొలసిన శరీరానికి విశ్రాంతినివ్వటం మీదనే భర్త దృష్టి కేంద్రీకరించబడి ఉంటే- పగలల్లా తీరిగ్గా కన్న పగటి కలలకు- రాత్రి నిజరూపాలను తీర్చిదిద్దాలని ఉవ్విళ్ళూరే ఇందుమతికి నిరాశ మినహా మరేమీ మిగలకుండా ఉన్నది.

ఇంట్లో అత్తగారు తప్ప మరెవ్వరూ లేరు. వంటామె రాత్రి ఎనిమిదింటికే వెళ్ళిపోతుంది. పగలుకూడా వంటచేసి పదకొండింటికే వెళ్ళి, సాయంత్రం ఐదింటికి వొస్తుంది. చేసేందుకు ఇందుమతికి చేతినిండా పనంటూ లేదు. అందుకనే ఆమె ఊహలు కట్టలు తెంచుకున్న మహానదీ ప్రవాహమల్లే దారీ తెన్నూ లేకుండా విస్తరిస్తూన్నవి.

ప్రశాంతిని ఆశించేది కాదు- యవ్వనం. కనీసం తన కో నలుసు వున్నా కొంత కాలక్షేప మయ్యేది. తన యీ కోర్కెలకు రూపురేఖలు దిద్దే నాథు డేడీ? రాత్రి పదింటికే తుమ్మమొద్దల్లే గాఢనిద్రలో నిమగ్నుడైన భర్తను ఏవిధంగా మేల్కొల్పి, రెచ్చగొట్టి మదనకేళికి ఆహ్వానించగలదు?

అదీగాక 'ఇల్లాలు' వేషం వేశాక, బరితెగించిన ఆడదాని లాగు, భర్తను సవాలు చేసేందుకు ఆమెకు మనస్కరించటం లేదు. ఇక అత్యవసరం తొందరపెట్టగా, ప్రకృతి క్రూర శాసనాలు నిర్దాక్షిణ్యంగా అమలుజరిగే ప్రమాదం వాటిల్లగా, సామాజిక నిబంధనలూ, నైతిక చట్టాలూ పరిధులూ ఏర్పరచగా– తనకు కామతృప్తి నివ్వవలసిన భర్త బాధ్యతల్ని తనకు తానై గుర్తు చేద్దామంటే – తన భార్య 'కామపిశాచి' అనీ, అతి తెలివిపోయి, తనను శిక్షిద్దామనీ, తన మీద కసి తీర్చుకుందామనీ, తనకు తెలిసిన న్యాయవాదిత్వాన్ని బలాత్కారంగా తన పట్ల ప్రయోగిస్తాడేమోననే భయం ఇందుమతిని వెంటాడసాగింది.

దంపతుల్లోని వయోభేదం ఎంత తీవ్రరూపం దాలుస్తుందో, ఎన్నెన్ని వెర్రితలలు వేసేందుకు ఏ విధంగా ముందువెనుకలు చూడదోకూడా ఆమె బుర్రలో రూపధారణలు చేసింది.

ఐతే సామాన్యురాలివలె తొందరపడి ఏ అఘాయిత్యమూ చేసేందుకు ఆమె సాహసించలేదు. పుట్టినింటికీ, మెట్టినింటికీ పేరు ప్రఖ్యాతులు తేవలసిన తన బాధ్యతను ఆమె ఏమరలేదు. మరి యీ గాఢవాంఛలు తీరే మార్గ మేమిటి?

ఎంత సంపదా, సౌభాగ్యం ఉండి ఏం లాభం? తన యవ్వనం అడవిగాచిన వెన్నె లవుతోంది. దీన్ని ఇతరులు అనుభవించటం తన ఉద్దేశ్యం కాకపోయినా, ప్రకృతి విధించిన ఆంక్షలను అనుసరించి ఇతరులు ఆస్వాదిస్తేనే తప్ప తనకు ఆ ఆనందం లభ్యమవదు మరి!

ఎన్నో లా పాయింట్లు తెలిసిన తన భర్తకు, తన కళ్ళ యెదుట మదన వికారాలు పొందుతూ వాటికి తట్టుకోలేక నానా అవస్థపడే నారీరత్నం – నిజకళత్రం తాలూకు బాధ ఎందుకు తెలియదో? తనను తాను నీచపరుచుకోకుండా సూచించే విధానాలన్నీ బూడిదలో పోసిన పన్నీరవగా, తీరని కోరికల తాలూకు ఆవేదనా, కన్నీరే తనకు ప్రతిఫలమైంది!

ఇలా ఉండగా ఒకరోజు ఉదయం ఋతుస్నానం చేసి దొడ్లో బొడ్డుమల్లె మొగ్గలు కోసుకొంటూండగా చిన్న గులకరాయి ఒకటి వొచ్చి యవ్వనం తొడిగిన తామరమొగ్గవలె పొడుచుకొచ్చిన వక్షోజానికి తగిలింది.

ఇందుమతి శరీరమంతా రెండువందల ఇరవై వోల్టుల విద్యుత్తు ప్రవహించి, జలదరించింది. మూలమూలాల్లోనూ అజ్ఞాతంగా ఉన్న వాంఛలు గుంపులు గుంపులుగా వెలికివచ్చి ఆమెను రెండు క్షణాలపాటు కంపింప జేసినవి. అంతలోనే అతికష్టంమీద నిలవదొక్కుకుం దామె.

దెబ్బయితే తగలలేదు కాని, ఎవరా, ఏమిటా అనిపించింది. ఎవరో తన దృష్టిని ఆకట్టుకోవాలనే యీ పని చేసి ఉండొచ్చు. యీ మాత్రం రసికత్వం వొలికించేందుకు తన భర్తకు తీరిక లేదనికూడా ఆమెకు తెలుసు.

ఇందుమతి చుట్టుపక్కలంతా కలయజూచింది. ఆమెకు యెవ్వరూ కనిపించలేదు. ఏ పక్షన్నా అయి ఉంటుందా అనే ఆలోచన వచ్చింది కాని, అలాటి అవకాశాలేమీ ఉన్నట్టు తోచలేదు.

తలారబెట్టుకుంటూ, ఒక కంట కనిపెడుతూనే తానేమి గమనించనట్లుగా నటిస్తూ, తిరిగి ఆమె పూలు కోయసాగింది. మరో చిన్న గులకరాయి వొచ్చి వీపుకు తగిలింది. ఈసారి ఆమె యీ చిలిపి చేష్టల కర్తను గమనించింది.

ఎవరోకాదు-పక్కయింటిలో తమ దొడ్డికి ఆనుకొని ఉన్న గది అద్దెకు తీసుకొని కాలేజీ చదువు సాగిస్తున్న బ్రహ్మచారి శంకరమే- తాను అనుమానించిన ప్రేమపక్షి! గత సంవత్సరం గాలివానకు ఆ యింటికీ, ఈ యింటికీ మధ్య ఉన్న గోడ కొద్దిగా పడిపోయింది. ఆ గోడ పక్కింటివాళ్ళది కావటంవల్ల, వారే బాగుచేయిస్తారని రామనాథం మిన్నకున్నాడు. అది అలా మొండిగోడగానే ఉండిపోయింది. అటునుంచి ఇటుకానీ, ఇటునుంచి అటుకానీ యెవరైనా తేలిగ్గా దాటిపోవచ్చు. ఇందువల్ల యెవరికీ ఇబ్బంది కలగటం లేదు గనుక దాన్ని గూర్చి పట్టించుకున్నవారు లేరు.

ఇక యీనాడు శంకరం గులకరాళ్లు విసరటం- యీ మొండి గోడ పక్కనే నక్కి, నిర్వహిస్తున్నట్లు ఇందుమతికి రూఢి అయింది. గోపికలమీద రాళ్లు వేసీ, వాళ్ళ కుండలకు బొక్కలు పెట్టీ, వాళ్ళు జలకాలాడుతూంటే వాళ్ళ చీరెలు దొంగిలించిన అలనాటి గోపాలకృష్ణుని వేషాలను యీ శంకరం ప్రవర్తన యీనాడు సూచిస్తున్నది.

ఇతని ఉద్దేశ్య మేమిటి? తనతో పరాచికాలాడేటంత సాహసం ఇతనికి యెక్కడిదీ? గత పది పదిహేను రోజులుగా ఓరకంటి చూపుల తూపులు ప్రయోగించటం, అసందర్భంగా తనను చూసి చిరునవ్వులు చిలకరించటం, కళ్ళనిండా కోర్కెలు నింపుకొని వేడివేడి దృక్కుల్ని ప్రసరించటం, దగ్గి తన దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించటం మొదలైన చిలిపి చేష్టలు తను గమనిస్తూనే ఉన్నది. తాను ఏ విధమైన ఉత్సాహ, ప్రోత్సాహాలనూ ఇవ్వలేదు. ఐనప్పటికీ ఈనాడు శంకరం అనంగరంగంలో మరో 'అంగ' ముందుకు ఉరికేందుకు ఎలా సాహసించాడూ?

ఈ కొంటెవేషాన్ని తానూ, శంకరంగాక మరెవరైనా గమనించారా అనే అనుమానమూ, అలా ఇతరుల కంటపడితే ఏం కాను అనే గగుర్పాటూ ఇందుమతిని భయపెట్టినవి. అందుకని ముందామె చుట్టుపక్కల కలయజూచి ఇతరు లెవరి కంటి చూపుకూ ఈ దృశ్యం అందలేదని గ్రహించి మనసు దిట్టపరుచుకున్నది.

తనలాటి సాధ్విని, మహా ఇల్లాలిని, పరమ పవిత్రమూర్తిని, పతివ్రతను- యీ శంకరం ఏమనుకున్నాడో, యెలా భావిస్తున్నాడో ఆమెకు అంతుబట్టలేదు. కేవలం ఆడపిల్లను అల్లరిచేసి, ఆమె ఉడుక్కుంటూంటే తను వినోదించటమే శంకరం ఉద్దేశ్య

మనుకున్నప్పటికీ, అలాటి పిచ్చి పిచ్చి అభిప్రాయాలను వెంటనే రూపు మాపకుంటే, అవి గొప్ప ప్రమాదాలకు దారి తీస్తవి.

యెలా చెప్పాలా? ఏం చెప్పాలా? అనే ఇందుమతి ఆలోచనలు ఇంకా తెగలేదు. అరిచి గోలచేస్తే లేనిపోని రభస తప్పదు. తన శీలాన్ని అనుమానించే సూచన చేసినట్లయితే తనకే కీడు మూడుతుంది. అందుకని రహస్యంగానే చాలా గట్టిగా, హెచ్చరిక చేసి శంకరం మరొక్క అడుగు ముందుకు వేసేందుకు సాహసించకుండా చేయటం అత్యుత్తమం.

ఈ సమయంలో భర్త ఆఫీసుగదిలో క్లెయింట్లతో గొడవపడుతూంటాడు కనుక ఇటు వొచ్చే ఆస్కారం లేదు. ముసలి అత్తగారు పూజా పునస్కారాలు జరుపుకుంటూనే వంటావిడకు ఫర్మానాలూ జారీచేస్తూ, తనకు ఇష్టమైన వంటలు చేయించుకోవటంలో నిమగ్నమై ఉంటుంది.

అందుకని పెట్టవలసిన నాలుగూ ఇప్పుడే నసాళం అంటేట్లుగా అంటబొడుస్తే, ఇకముందన్నా వొళ్ళు దగ్గిరుంచుకుని అతను అల్లరిపాలై, తనను రచ్చకీడ్వకుండా జాగర్త పడతాడు. అలాగాక తా నిప్పుడు మెదలకుండా ఊరుకుంటే మౌనం అంగీకారంగా భావించి పైపైకి యెక్కేందుకు ప్రయత్నించవొచ్చు.

ఈ నిశ్చయానికి రాగానే ఇందుమతి కనుబొమలు ముడివేసి కళ్ళల్లో కోపాగ్నిని ప్రజ్వరిల్లజేస్తూ శంకరంవైపు చూసింది. తన తీవ్రకోపాన్ని కూడా గమనించనివానివలె శంకరం ఆమెను చేయెత్తి పిలిచాడు. ఈ శంకరంగాడు మదోన్మాదుడై ఉండాలని ఇందుమతి అనుకోవటంలో బేసబబేం లేదు.

తగిన విధంగా బుద్ధి చెప్పేందుకు తాను నిలబడిన తావునుంచైతే గొంతెత్తి అరవాలి. అప్పుడు నలుగురూ జేరి మరింత గొడవకాక తప్పదు. అందుకని ఆమె మొండిగోడ సమీపానికి వెళ్ళి "ఇదేం మర్యాదగా లేదు. పిచ్చి వేషాలు వేస్తే దుష్ఫలితాలు తప్పవు- జాగ్రత్త!" అని తీవ్రమైన కంఠ స్వరంతో, తగ్గుస్థాయిలో అంది.

శంకరానికి యీ తిట్లు దీవెనల వలెనే తోచి ఉండాలి.

"రాత్రి ఒంటిగంటకు కాచుకొని ఉంటాను. యీ గోడ దగ్గరికే రా!" అన్నాడు శంకరం.

తన ప్రవర్తనను వేరు విధంగా తీసుకొనే సావకాశమే లేదు. ఐనప్పటికీ యెవరికివారు పరిస్థితుల్ని తమకు అనుకూలంగా తిప్పుకునేందుకు ప్రయత్నించటం యీనాడు కొత్త విషయమేం కాదు.

"తప్పకుండా - రా!" మళ్ళీ అన్నాడు శంకరం.

"ఎందుకూ?"

"మంచిమాట– అప్పుడు చెపుతాగా! నీ కోసం వేచి యెదురు తెన్నులు చూస్తూంటాను!" అని, ఆమె జవాబుక్కూడా ఎదురు చూడకుండా శంకరం చకచకా వెళ్ళిపోయ్యాడు.

❋ ❋ ❋

ఈ విచిత్ర సంఘటనను గూర్చి ఇందుమతి సాయంత్రం దాకా యెంత తీవ్రంగా ఆలోచించినా. తన ప్రవర్తనలో యెక్కడా యే లోపమూ ఉన్నట్లు తోచలేదు. తాను దాంపత్య సౌఖ్యానికి మొహం వాచిపోతూ, దాన్నెలా సాధించాలా అని దీర్ఘాలోచనలు చేస్తున్న సంగతి తనకూ, ఆ దేవునికీ తప్ప మరెవ్వరికీ తెలియదు. ఆ దేవుడేమో తనకేమీ పట్టనట్టు ఊరుకొనే రకమే కాని, శంకరానికి తెలియజెప్పే రకం కాదు కదా! ఐనప్పుడు శంకరం దీ న్నెలా వాసన పట్టాడూ?

శంకరం ప్రవర్తన యెంత జుగుప్సాకరంగా ఉన్నది! స్త్రీని ఆకర్షించేందుకు అతను వేసిన యెత్తులు పోకిరీలకే చెల్లుతవి! అలాటివాణ్ని ఏ సంసారి, ఎంత గాఢంగా వాంఛించినా, పరువుప్రతిష్ఠలు నేలపాలు చేసుకొనే విధంగా జేరేందుకు సాహసిస్తుందీ?

ఐనా యీ గొడవంతా తనకు దేనికి? తాను తిరస్కరించినా కుక్కవలె తోకాడిస్తూ వెంటపడే వాణ్ని తా నెలా ఆపగలదు? గుణపాఠం నేర్పేందుకు తనకు యిప్పుడో చక్కని అవకాశం ఉండనే ఉన్నది. తనకోసం యెదురుతెన్నులు చూస్తూ ఆ రాత్రంతా మొండిగోడ పక్కనే శంకరం వేచి ఉంటాడు. తాను వొస్తాననే ఆశ అతన్ని ఆ స్థలంలోనే బంధించి, గోడకుర్చీ వేయిస్తుంది. తెల్లగా తెల్లవారాక నడుములు సడలి, మోకాళ్ళు బిగుసుకొనిపోయి– రేపు పగలంతా తీసుకుంటాడు. అప్పటిక్కాని తిక్కకుదిరి తన పొరబాటు తెలుసుకోలేడు. ఇక లాభంలేదని అతనే యీ పిచ్చికళలు మానుకుంటాడు.

ఇదే సరైన మందని ఆమె నమ్మి – శంకరాన్ని గూర్చిన ఆలోచనల్ని దూరతీరాలకు పారద్రోలింది.

ఆ రాత్రి భర్త దగ్గర స్వర్గసౌఖ్యాలు అనుభవించాలని ఆమె మనసు ఉవ్విళ్ళూరుతోంది. భర్తకు యెంతో ఆకర్షణీయంగానూ, సవాలుగానూ కనిపించి అతనిలో ప్రణయాగ్ని జ్వాల రేకెత్తించాలని ఆమె నిశ్చయించుకున్నది.

కాపరానికి వొచ్చాక, ఈనాడే మొట్టమొదటిసారి రెండు జడలు అల్లుకున్నది. ఘుమఘుమలాడే మల్లెల్ని జడలో తురిమింది. కొత్తగా కొన్ని పీలికల్ని కలేసి కుట్టినట్లుండే బాడీ వేసి, వీపుమీది బెల్టు రింగును బాగా బిగించింది. సన్నగా చాలా వొదులుగా ఉండే కొత్త జాకెట్ – వెనకాల నొక్కు గుండీలున్న దాన్ని ధరించింది. సాయంత్రంనుంచే అలంకరణలు ప్రారంభించి, ఊదారంగు పావడామీద ఊదారంగు నైలాన్‌చీరె ధరించి– తన శరీర సౌందర్యమంతా కనిపించీ కనిపించకుండా ఉండేవిధంగా చేసుకున్నట్లు గర్వపడింది.

సాయంత్రం అలా వీధివాకిట్లో నిలబడితే- దారినపొయ్యే పురుషులు ఆకలిగొన్న పులి, లేడిపిల్లను చూసే విధంగా తన వైపు చూడటాన్ని ఆమె గమనించింది. తన యీ అలంకరణలు భర్తకు ఉత్సాహ, ఉద్రేకాలను ప్రసాదిస్తాయని ఆమె గాఢంగా నమ్మింది. ఇంతలో శంకరం యెదురై- యీ అవస్థంతా తన కోసమేనని నమ్మినవాడల్లే ఒక చిరునవ్వు విసిరేసి తన గదికి వెళ్ళాడు. ఇందుమతికి వొళ్లుమండి ఇంట్లోకి వెళ్ళిపోయింది.

చీకటిపడినా ఆమె పగటి కలలు కంటూ, ఊహా ప్రపంచంలోని తూగుటుయ్యాల లూగుతూ, బరువుగా కదిలే కాలాన్ని గడపసాగింది.

ఈ రాత్రి తనను చూడగానే భర్త కామాంధుడై తనను తీవ్రంగా ఎదుర్కొంటాడనే ఊహ ఆమెను భూమి మీద నిలవనీయటం లేదు.

రోజూ ఏడింటికల్లా యింటికి వొచ్చే భర్త యీ రాత్రి తొమ్మిదైనా రాలేదు. ఇందుమతి నిరుత్సాహంతో, నిట్టూర్పుతో, చిరాకుతో, పరాకుగా- తనమీద తనకే కలిగిన జుగుప్సతో మధనపడసాగింది.

చివరకు పదింటికి అలసి, సొలసి ఆవలింతలతో, చికాకుతో రామనాధం యింటికొచ్చాడు. ఇందుమతి చిరునవ్వులతో ఇచ్చిన ఘనస్వాగతాన్ని కూడా అతను సరిగా గమనించలేదు. కనీసం తనను తేరిపార జూచి, తాను గమనించానన్న విధంగా నవ్వనైనాలేదు. సరాసరి ఆఫీసుగదిలోకి వెళ్ళి కాస్సేపు రికార్డులు చూసుకొని, దొడ్లోకి వెళ్ళి మొహం కడుక్కొచ్చి, భోజనానికి కూర్చున్నాడు.

ఇందుమతికి పెద్దగా ఏడవా లనిపించింది. ఇంత అరసికుణ్ణి భర్తగా స్వీకరించినందుకు తగిన శిక్షను అనుభవిస్తూన్నట్లే తోచిం దామెకు. తానే వయ్యారం వొలకబోస్తూ భర్తకు భోజనం వడ్డించాలని మొదట అనుకొన్నది. ఇప్పుడు తనపై తనకే కలిగిన అసహ్యం కారణంగా ఆ పని తన భర్తకే పురమాయించి, పడకగదికి వెళ్ళిపోయింది- ఇందుమతి.

ఇప్పుడు ఏం చేయాలా అనే సమస్య ఎదురైం దామెకు. అలిగి, అలకపాన్పును అలంకరిస్తే, భర్త గ్రహిస్తాడనే ఆశ లేదు. నిద్రపోయినట్లు నటించటంవల్ల తనకు మరింత నష్టం. ఎలాగూ భార్య నిద్రిస్తున్నది కనుక, ఆమెకు నిద్రాభంగం కలిగించట మెందుకని ఆయన కూడా నిద్రకు ఉపక్రమించవొచ్చు. అందుకని, ఏదో చదువుకుంటూన్నట్లుగా ఆయన వొచ్చేదాకా మేలుకొని ఉండి, మరికొన్ని సూచనలు చేస్తే ఏమైనా ప్రయోజనం ఉండొచ్చు.

ఈ నిశ్చయంతో ఆమె పుస్తకం తెరిచింది. అక్షరాలు మహాప్రవాహంలో తేలిపోతున్న ఎండుటాకులవలె ఉన్నవి. ఒక్కముక్కన్నా అర్థంకావటం లేదు. మనసంతా కోరికలతో నిండి తనను వెక్కిరించి వేళాకోళం చేస్తున్న ట్లనిపించిందామెకు!

పుస్తకం పేజీలో అచ్చు అక్షరాలకు మారుగా ఉదయం మొండిగోడ ప్రాంతాల జరిగిన దృశ్యాలు సినిమాబొమ్మల వలె ఇందుమతి కళ్ళముందు తిరగసాగినవి. శంకరాన్ని గూర్చిన ఆలోచనల్ని దూరానికి నెట్టెయ్యాలని ఆమె యెంత తీవ్రంగా ప్రయత్నించినా, ఈ సాయంత్రం అతను తనవైపు చూసిన చూపూ, విసిరిన చిరునవ్వూ స్పష్టంగా కళ్ళముందు మెదలుతున్నవి.

భోజనమయ్యాక భర్త పడకగదికి రాకుండా ఆఫీసుగదికి వెళ్ళి ఉండాలని ఆమె అర్థం చేసుకున్నది. చట్టంలో యెక్కడా దాంపత్యాన్ని గూర్చి కానీ, భర్తల బాధ్యతల్ని గురించి కానీ చెప్పబడలేదేమో? ఈ భర్తను తనకు కావలసిన విధంగా పోతపోసుకోవట మెలా?

క్షణక్షణానికీ ఆమె ఆతృత హెచ్చుతున్నది. వెధవది– నిద్ర వొచ్చినా బాగుండును, ప్రశాంత మానసమైతే నిద్రపడుతుంది. కోరికల కత్తులు గాయపరుస్తూంటే, వాటికి ఉపశమనం లేకుండా నిద్రెలా వొస్తుందీ?

ఇప్పటికీ నిరాశపడ నవసరం లేదని ఇందుమతి తనకు తాను ధైర్యం చెప్పుకున్నది. భర్త గదిలోకి రాగానే యెదురు వెళ్ళి కావలించుకోవా లనుకున్నది. అతన్ని యెన్నివిధాల రెచ్చగొట్టాలో, అన్ని విధానాలనూ ఆలోచించి, ప్రయోగ పద్ధతుల్ని తర్కించుకుంటూ అతని రాకకోసం యెదురుతెన్నులు చూస్తోంది.

పదకొండు దాటాక– ఆవలించుకొంటూ భర్త పడక గదికి జేరాడు. ఆయన్ను చూస్తే ఇందుమతి నవనాడులూ కుంగిపోయినవి. ఆయన ముఖంలో యెంతో బరువు– భారాలూ– చిరాకు స్పష్టంగా కనిపిస్తున్నవి. ఆ స్థితిలో తానేం చేసి ఏం ప్రయోజనం? తాను బయటపడి, భంగపడి, అవమానంతో దహించుకొని పోవలసి ఉంటుందని తెలిసీ, దాని జోలికి పోవటం అవివేకమే అవుతుంది కదా!

"పదకొండు దాటుతే ఇంకా మేలుకొనే ఉన్నావా? ఆరోగ్యం చెడుతుంది. రేపు చదవొచ్చులే– పడుకో!" అని రామనాథం టేబిల్‌మీద సిద్ధంగా ఉంచిన పాలు తాగి, ట్యూబ్‌లైట్ ఆర్పి, నైట్‌లాంప్ వేసి, తన పక్కమీద బరువుగా వాలాడు. భార్యవైపు కూడా చూడకుండానే అటు తిరిగి పడుకున్నాడు.

ఏది ఆరోగ్యమో, ఏది అనారోగ్యమో తనకు తెలియజెప్పిన భర్తమీద ఇందుమతికి గొంతుదాకా కోపం పొంగి పొర్లింది. తనను తేరిపారజూస్తే ఏదయినా ప్రమాదం వాటిల్లుతుందేమోనన్న విధంగా భర్త ప్రవర్తిస్తే, యవ్వనపు వాంఛలతో వేగిపొయ్యే భార్యకు యెలా ఉంటుందో తేలిగ్గా ఊహించవచ్చు!

అప్పటికీ ఆమె ఆశలు వీడలేదు. మెల్లిగా వొత్తిగిలి భర్త మంచంవైపు జరిగింది. అప్రయత్నంగా జరిగినట్లుగా మృదువైన తన చేతిని అతని వీపుకు ఆనించింది. ఐతే

అప్పటికే రామనాథం గాఢనిద్రకు ఉపక్రమించిన కారణంగా ఇందుమతి స్పర్శ అతనికి తెలియరాలేదు.

తుపాకిగుండు తగిలిన పెద్దపులివలె ఐంది ఇందుమతి మానసం. వాంఛల తీవ్రతను ఆమె తట్టుకొనే స్థితిలో లేదు. సమాజం అనుమతించిన చోట అరసికత్వం ఎదురైతే, సమాజం గర్హించే తావులో తనకు ఆహ్వానమూ, రసికత్వమూ సిద్ధంగా ఉన్నవి. ఈ రెంటి తీవ్ర ఘర్షణ మధ్యలో ఎంతగా తాను నలిగిపోవలసి వొస్తోంది!

ఇక ఈ రాత్రికి ఆశలన్నీ అడుగంటినట్లే! నిద్రాదేవి పరమ విరోధి మకరధ్వజుడు మననీయని విధంగా వాడి బాణాలతో బాధపెడుతున్నాడు. సరసం లేకుంటే మానె-విరసమైన విచారసాగరంలో మునగవలసి వొచ్చింది కదా!

సుఖం దూరమవుతూంటే జీవితం నిస్సారమే అవుతుంది కదా! తుమ్మమొద్దల్లే నిద్రపోతూన్న భర్తను నమిలి మింగేద్దామన్నంత కోపం వొస్తోంది. తనే యమబాధలు పొందుతూ, తనను తానే ఊరడించుకోవటం ఎంత దౌర్భాగ్యం!

శరీరమంతా కుమ్మరిపురుగులు తొలుస్తున్నట్లుంది! ఈ కామజ్వాలల్ని ఆర్పేందుకు రసికుడైన పురుషుడే శరణ్యం! దేన్నయితే సమాజం సరఫరా చేయదో, దేనిమీదయితే ఆంక్షలూ, కంట్రోళ్ళూ అధికంగా ఉంటవో- అప్పుడే వాటి విలువలు కృత్రిమంగా ఆకాశాన్నంటటం, బ్లాక్ మార్కెట్‌లో తప్ప లభ్యపడకుండటం ఇందుమతికి అనుభవపూర్వకంగా తెలిసిన విషయమే! ఈ సిద్ధాంతానుసారం తాను అడ్డదార్లలో దాన్ని అందుబాటులోకి తెచ్చుకోవటం ఒక్కటే మార్గం!

ఈ తలపు రాగానే శంకరం గుర్తుకొచ్చాడు! తా నీ మన్మథా వస్థలో మసయిపోతానని ముందే గ్రహించి, తనను కాపాడి తన వాంఛల్ని మన్నించి తృప్తినిద్దామని నడుం బిగించిన నవ యువకుడే యీ శంకరం అనిపించిం దామె కీ క్షణాన!

-కాని అంతలోనే ఆమె అహం అడ్డుపడింది. తన బలహీనతను ఆధారంగా చేసుకొని, తనది పై చేయిగా ఉండాలనే శంకరం ఊహ ఆమెకు కష్టం కలిగించింది.

అసలు యీ ఉదయం యీ శంకరం వ్యవహారమే జరగనట్లయితే, తన కింత బాధ దాపరించేది కాదేమో? సహజ వాంఛలతోనే సతమతమవుతూంటే, యీ కృత్రిమ విధానాలు మరింతగా రెచ్చగొడుతున్నవి కదా! తన అవస్థ ఏదో తాను పడుతుంది; మధ్యలో యీ శంకరం ప్రమేయం దేనికి?

ఈ శంకరంలాంటివాళ్ళు ఎరలు చూపకుండా ఉంటే తన లాటి మీనాక్షులు భంగపడవు కదా! అందుకని, ఒక్కసారి వెళ్ళి, ఆ శంకరాన్ని నాలుగూ దులుపుతే బాగుండునేమో ననిపించింది ఇందుమతికి.

రాత్రికి రమ్మని ఆహ్వానించటమేగాక 'మంచి మాట' అన్నాడు శంకరం. మాట్లాడదలిచిం దేమిటో తనకు తెలీకనా! ఐనా ఇంకేం వాగుతాడో వాగనిచ్చి శృతిమించే పక్షంలో మెత్తని చెప్పుతో బుద్ధి చెప్పి సురక్షితంగానూ, పవిత్రంగానూ తిరిగి రావొచ్చు. అప్పుడు తన నిగ్రహ శక్తీ, పతివ్రతా దీక్షా కనీసం తనకు తాను రుజూ చేసుకున్నట్లవుతుంది. భర్త చూపిన నిరాదరణకు ఆయనమీద ప్రతీకారం తీసుకొనే అవకాశం ఎటూ లేదు! ఆ జాతికే సంబంధించిన శంకరం మీదన్నా తన అక్కసు వెళ్ళబుచ్చుతేనే తప్ప తనలో పగిలి, సెగలు కక్కుతూన్న యీ అగ్నిపర్వతం చల్లారదు.

ఐతే తన సౌందర్యానికే ముగ్ధుడై, తన పొందు కోరిన వాణ్ని ఆదరించకపోతే మానె- అవమానించటం అన్యాయం అవుతుంది! తనను కోరే వారందర్నీ సంతృప్తి పరచవలసిన బాధ్యత తనకేం ఉన్నది? అందుబాటులో ఉన్న యీ శంకరాన్ని పెడదారులనుంచి తప్పించి, నైతిక పతనం కాకుండా కాపాడటమేగాక, తనను తాను కూడా కాపాడుకోగలిగిన సామర్థ్యం తనకు ఉన్నదని నమ్మిన తాను, దాన్ని రుజూ చేసుకోవద్దా?

ఈ విధంగా తర్కించుకొని, తనలో చెలరేగిన మహోద్రేకానికి ఏదో వొక విధమైన విడుదలను ఆశించి, శంకరం దగ్గిరికి వెళ్ళితీరాలనే నిశ్చయానికి వచ్చింది ఇందుమతి.

జీవితంలో అర్ధరాత్రి సమయాన, ఒంటరిగా పరపురుషుని కొరకు (ఈ భావం ప్రపంచాని కంతటికీ ఉండటంలో ఆశ్చర్యంలేదు! కాని ఆ పరపురుషుణ్ని దూరాన ఉంచేందుకే కదా తాను బద్ధకంకణ ఐంది!) వెళ్ళటం ఇదే మొదటిసారి. ఆమెను తీవ్రమైన భయం ఆవరించి కంపింపజేసింది. ఐతే తీవ్రమైన ఉద్రేకం ఆ భయాన్ని పారద్రోలింది. కోరికల గుర్రం భయపు మేఘాలను అధిగమించింది.

ప్రతిదానికీ 'మొదటిసారి' అనేది ఉండక తప్పదు. అది యెప్పుడో ఒకప్పుడు మొదలై తీరవలసిందే కదా!

రేడియమ్ డయల్ బిగ్‌బెన్ మీది రెండుముళ్ళూ ఒకదానిమీద మరొోటి కరుచుకొని పోయినవి. శంకరం చెప్పిన సమయం మరో గంటకుకాని రాదు. ఐనప్పటికీ ప్రియురాలికోసం వేచి ఉండే ప్రియుని కళ్ళకు నిర్ణీత సమయం యెంతో ముందుగానే కనిపిస్తుందనే విషయాన్ని ఇందుమతి అనేక కథల్లో చదివే వున్నది. కనుక తాను ఇప్పుడు బయలుదేరి వెళ్ళినా, శంకరం మొండి గోడ దగ్గిర పడిగాపులు కాయటాన్ని కళ్ళారా చూడొచ్చు!

అన్నట్లు యివాళ తిథి శుక్లపాడ్యమి. కనుక బయట చిక్కని చీకటి అల్లుకొని ఉండాలి! పడకగది పక్కనే ఉన్న సందులోంచి వెళ్తే మొండిగోడ యాభైగజాలకన్న (ఓపిక ఉంటే దీన్ని మీటర్లలోకి మార్చుకో!) యెక్కువ దూరం ఉండదు. తనకు చీకట్లో

యెలా, ఏమీ కనిపించదో ఇతరులకూ అంతే! ఈ చీకటి ప్రకృతి ఏర్పరచిన రక్ష! భయపడేవారికి సాహసాన్ని అందించే మందు!

ఎంత చంపుకున్నా చావని భయం వెనుకంజ వేయిస్తుంటే– ఉద్రేకం ముందుకు పొమ్మని ఊపుతోంది. ఆమె పక్కమీద లేచి కూర్చొని, ఒక్కసారి భర్తను పరిశీలించి చూసింది. పిడుగులు పడినా లేవని స్థితిలో రామనాథం సన్నగా గురక పెడుతూ గాఢనిద్రలో ఉన్నాడు.

లేచి నిలబడి, ఒక్కసారి వొళ్ళు విరుచుకొని బట్టల మడతలు సరిజేసుకొని, మరోసారి గదంతా కలయజూచింది. వాతావరణ మంతా తనకు వీడ్కో లిచ్చేందుకు అనుకూలంగా ఉన్నది.

మెల్లిగా లేచి జాగ్రత్తగా చప్పుడు కాకుండా గది తలుపు తెరిచింది. సందులో చీకటి. కన్ను కాస్త అలవడుతే చేత్తో తడువుకోవలసిన పని ఉండదని తోచింది. గది తలుపు మూసి, చప్పుడు కాకుండా బయట గొళ్లెం పెట్టింది– ఇందుమతి.

గెలవాలనే పట్టుదలతో మైల్ రేస్‌లో పాల్గొన్న విధంగా ఆమె గుండెలు కొట్టుకుంటూన్నవి. తన గుండెలు కొట్టుకొనే శబ్దం తనకే వినిపిస్తూన్న ట్లనిపించింది. అక్కడే అదే స్థితిలో కాస్సేపు నిలబడి, తనకు తాను ధైర్యం చెప్పుకొని యెలాగో నిలవదొక్కుకోగలిగిం దామె.

అలసట తీరగానే భయంతోనే ఒక్కో అడుగే తూచి తూచి వేస్తూ, నడక సాగించింది ఇందుమతి. మొండిగోడ సమీపిస్తూన్నకొద్దీ ఆమె గుండెలు గొంతుకలో కొట్టుకొంటున్నవి. దారి కనిపించీ, కనిపించకుండా ఉన్నప్పటికీ ఆమె నడిచే వేగానికి ఆ మాత్రం కనిపిస్తే చాలనిపించింది.

ఎలాగో మొండిగోడ దగ్గరికి వొచ్చిం దామె. అవతలి వైపున బహుశా శంకరం కాచుకొని ఉండొచ్చు. ఇంతదూరం వొచ్చి ఇంకా ఆలోచిస్తూ యీ పుణ్యకాలం కాస్తా పాడు చేయటంలో అర్థముండదు.

ఈ ఆలోచనతో ఆమె చీర కుచ్చెళ్లు కాళ్ళకు అడ్డం పడకుండా కాస్త పైకెత్తి పట్టుకొని, మొండిగోడ మీద కాలు వేసిందో లేదో ఆ కాలు ఒక చిన్న మట్టిపెళ్ళ మీదపడి, అది చితికి, ఆమెను అవతలివైపు బలంగా తోసివేసింది. తాను తలకిందుగా పడబోతున్నాననే భావం మనసులో మెరవగానే, మొహానికి దెబ్బ తగిలి మూతి పళ్ళు రాలుత వేమోననే భయంతో, ఎలాగైనా ఆ దెబ్బ చేతులతో కాచుకొనే ఉద్దేశ్యంతో రెండు చేతుల్నీ ముందుకు జాచి కిందికి వాలిపోయింది– ఇందుమతి.

కింద పడకుండా, ఎలాటి షాక్ కానీ, దెబ్బకానీ తగలకుండా శంకరం బలమైన చేతులు ఆమెను ఆపినవి. తన స్థితి తెలుసుకోకముందే తన శరీరం శంకరం చేతుల్లో

ఇమిడిపోవటం జరిగింది. తను పడకుండా పట్టుకున్నందుకు శంకరాన్ని మనసులోనే అభినందించిం దామె!

శంకరం చేతులు తనను రక్షించే ఉద్దేశ్యంతో పట్టుకోలేదనీ, భక్షించేందుకే సిద్ధపడినవనే విషయం ఇందుమతికి మరుక్షణంలోనే తెలిసిపోయింది.

శంకరం ఆమెను బిగియార కౌగలించుకొంటున్నాడు. వారి హృదయాలు ఢీ కొంటున్నవి. నిజానికి యీ బంధం యెంతో సుఖకరంగానూ, తన ప్రచండోద్రేకాలకు అనుపానంగానూ ఉన్నప్పటికీ తాను పతనమైపోతున్నాననే అంతరాత్మ సన్నని మూలుగు ఇందుమతిని కలవరపరచింది.

"వొదులు!" అన్నదామె నీరస స్వరంతో, అధికారం ధ్వనించే విధంగా.

"వొదులుగా ఉన్నదా? అయితే బిగిస్తా నుండు!" అని శంకరం ఆమెను ఉక్కు కౌగిలిలో బంధించాడు. ఆమె మరి యెలాటి అభ్యంతరాలూ చెప్పేందుకు వీలులేకుండా ఆమె పెదవులను తన పెదవులతో గట్టిగా పట్టుకున్నాడు. ఊపిరాడనంత గాఢంగావున్నా ఆ బిగికౌగిలి ఆమెకు ఒకవంక బాధాకరంగానూ మరొక వంక ఉపశమనంగానూ తోచింది. 'బాధానందం!' అంటే ఇదేనేమో ననిపించిం దామెకు మొట్టమొదటిసారి.

శంకరం చిలిపి చేతులు అంతతో ఆగలేదు. వొదులుగా ఉన్న జాకెట్ నొక్కుడు గుండీలను టపటప మనిపించినవి; మరుక్షణంలో బాడీ బెల్టును ఊడదీసినవి. ఈ రకం దుస్తుల ధారణలోని స్త్రీ ఉద్దేశ్యం శంకరం సరిగ్గా గ్రహించటమేగాక, దాన్ని స్వప్రయోజనార్థం సరిగ్గా ఉపయోగించి, ప్రప్రథమ ప్రయోగంలోనే 'మంచి రసికుడే!' అనే అభిప్రాయాన్ని ఇందుమతికి కలిగించాడు.

ఆడదాన్ని అడిగి, మొహమాటపెట్టి ఆమె సిగ్గుపడే విధంగా చేయటానికి మారుగా, ఆమెను కౌగలించుకొని, ఆమె అంగీకారంకొరకు వేచి ఉండవలసిన అవసరం లేకుండా, జాకెట్ గుండీలను తేలిగ్గా తొలగించి, బాడీ రింగును ఠంగున ఊడదీసే సదవకాశాన్నీ, తనకు ఇష్టమైన పనులను ఆమె పురుషుని చేత చేయించుకునే సావకాశాన్నీ కలిగించే యీ నూతన వస్త్రధారణను కనిపెట్టిన వారికి ఇందుమతిలాటి మదవతులు అభినందలు చెప్పుకోవటంలో ఆశ్చర్య మే మున్నది?

రసాస్వాదనలోని మొట్టమొదటి ప్రయోగానికే ఇందుమతికి మతిపోయింది. శంకరం బిగికౌగిలిలో కరిగిపోయింది.

శంకరం స్పర్శలోని అగ్నికణాల వేడిని ఆమె గ్రహించింది. అతనిలోని అగ్నిపర్వతం పగిలి, కక్కే లావాలను హృదయపూర్వకంగా స్వీకరించటమే తన యీ ప్రస్థుత స్థితికి ఉపశమనం కలిగిస్తుందనే భావనా, అదీ అందుబాటులోకే వచ్చిందనే ఊహ కలిగించే మధురానుభూతే ఇందుమతిని ఉక్కిరిబిక్కిరి చేసినవి.

శంకరాన్ని దూషించి, పతనంకాకుండా కాపాడదామనే ఆమె నిశ్చయం క్షణంలో పటాపంచ లయింది. అందుకు మారుగా తాను వొరిగి పోతూ, తనతోపాటే శంకరాన్నికూడా పతనమయేట్లు చేయటాన్ని ఇప్పు డెవ్వరూ అడ్డలేరని ఆమెకు బాగా తెలిసివొచ్చింది.

కృత్రిమమైన బిగింపులనుంచి విడివడి సహజ పటుత్వాన్ని ప్రదర్శిస్తున్న ఆమె వక్షోజాలే ఇప్పుడు సరాసరి ఆమె హృదయాన్ని శంకరానికి విప్పి చెప్పుకుంటూన్నవి. ఆ దివ్యానుభూతిలో కొద్దిక్షణాలపాటు ఇందుమతి తనను తాను మరిచిపోయింది.

అంతలోనే- తాను పిలిచీ పిలవగానే వచ్చి, అలుసై పొయ్యాననే భావమూ, శంకరాన్ని తప్పుపట్టి నిశితమైన మాటలతో శిక్షిద్దామని వచ్చి- అగ్నిశిఖల మీది నవనీతమయిపోయినందుకు అతని దృష్టిలో యింకెంత కిందికి పోతానో అనే ఊహా ఆమెను బాధించినవి.

అయితే 'ఇది మంచిపనికాదు!' అని భయాన కాదుకదా- నయానా ఐనా చెప్పే స్తోమతు ఆమెకు ఇప్పుడు లేదు. అలాటి నీతులు బోధించటం వలన, పొరపాటున అవి శంకరం మీద పనిచేసినట్లయితే, తనను పొదివి పట్టుకున్న అతని బాహువులు సడలటం, మరుక్షణంలో తాను భూమి కరవటం తప్పదు.

అదీగాక యీ అర్ధరాత్రి తాను నీతిని ప్రచారం చేసేందుకు పడకగది వీడి ఒంటరిగా, ఈ అలంకరణలతో శంకరంలాటి నవయువకుని దగ్గిరికి వచ్చిందంటే- శంకరంమాట అలా వుంచి, ఏమాత్రం లోకజ్ఞానం ఉన్న వ్యక్తయినా నమ్మడు సరికదా తన మౌఢ్యానికి తన మొహంలోనే వికటంగా నవ్వుతాడు. గాయానికి తోడు, అవమాన వ్యధ కూడా దేనికి? ఏమైనా- తన గురి ఏదయినప్పటికీ, ఈ ఫలితం తాను కలలుగన్న ఆనందాన్నే యిచ్చేదిగా రూపొందింది కనుక, దీన్ని స్వీకరించటమే వివేకం అనిపించింది ఇందుమతికి!

తనకన్న శంకరం కాస్త పొట్టి అవటం వలన, అతను తన ముఖాన్ని సుఖకరంగా అందుకునే ఉద్దేశ్యంతో తనను ముందుకు వంచుతున్నాడు. అలనాడు శివధనుస్సును ఎక్కుపెట్టే ప్రయత్నంలో శ్రీరాముడు యీ విధంగానే చేసి ఉండొచ్చు. బాణంబద్దలాగున్న తన శరీరం- శంకరం వొత్తిడిని ఎదుర్కొనేందుకు మారుగా, తనక్కూడా సుఖంగా ఉండే విన్యాసం కోసమై ఆరాటపడుతున్న విధంగా వొంగి పోయింది.

తరతరాలుగా భారతనారి హృదయంలో మూలమూలాల్లో దాగి ఉన్న 'పవిత్రత'- దిగుడుబావిలో మునిగిపొయ్యే వ్యక్తి గొంతువలె అస్పష్టంగా మూలుగుతోంది. ఈ క్షణిక సుఖం కోసం తన శీలం భంగపడవలసిందేనా అనే భావం చాలా బలహీనంగా కలిగిం దామెకు.

"ఇప్పుడు కాదు!" అన్నదామె రహస్యంగా మాట్లాడుతున్న విధంగా! అయితే మాటల అర్థ తాత్పర్యాలు ఏమైనప్పటికీ, ఆమె శరీరం మాత్రం దాడిని యెదుర్కొనేందుకు మారుగా, దానికో ఘనస్వాగతాన్ని ఇస్తున్న విధంగా వొంపులు తిరుగుతోంది.

ఆమె మాటలలోని భావాన్ని శంకరం మరో విధంగా అర్థం చేసుకున్నాడు. ఇంత రాత్రివేళ, ఇంతదూరం వచ్చి 'ఇప్పుడు కాదు!' అని చెప్పేందుకే నని నమ్మేటంత మూర్ఖుడా శంకరం! 'ఇప్పుడు' అనే పదానికి మారుగా 'యిక్కడ' అని మార్చుకొని, ఆమె భావాన్ని అవగాహన చేసుకున్నాడతను.

ఆమె అభిప్రాయం కూడా సబబైనదే! ఇక్కడ యీ ఆరు బయట ప్రణయకళోపాసన చేస్తుంటే- ఖర్మకాలి ఎవరయినా చూడటం సంభవిస్తే ప్రమాదం! అదీగాక - జంతువుల వలె మానవులు ఎక్కడపడితే అక్కడ. ఎప్పు డంటే అప్పుడే శృంగార రసాస్వాదనను సుఖకరంగా జరిపేందుకు ప్రకృతి నిర్ణయించి వుండలేదు. ముఖ్యంగా కట్టలు తెంచుకుంటూన్న యీ ఉద్రేక తరంగాలు సక్రమంగా సానుకూలంగా ఉపసంహరించబడేందుకు శయ్య అవసర మవుతుంది కదా!

"ఇక్కడొద్దులే... నా గదికి వెళదాం!" అన్నాడు శంకరం వినపడీ వినపడనట్లు.

ఆమె ఎలాగయినా గుంజుకొని, ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకొనే ప్రయత్నం చేద్దామా అని ఒక్కక్షణం ఆలోచించింది. చేతికందిన ఫలాన్ని జారవిడుచుకోలేని మానసిక దౌర్బల్యం ఆమెను ఆవరించింది. మిగతా ప్రపంచమూ, భర్త, సంసారం, పరువుప్రతిష్ఠలూ- ఇవేమీ ఆమెకు స్ఫురించటం లేదు. జ్వాజ్వల్యమానంగా భగభగమని మండే కామజ్వాలలో మసయిపోకుండా తనను కాపాడు కోవటానికే ఆమె పంచేంద్రియాలూ ప్రయత్నిస్తూన్నవి. అందుకనే తన ప్రయత్నమే లేకుండా ఆమె శంకరం భుజం మీద వాలి సరాసరి అతని గదిలోకి వెళ్ళింది.

బ్రహ్మచారి గుడారం యెంత అల్లకల్లోలంగా ఉంటుందో ఆ గది చూడగానే ఆమె గ్రహించింది. చెల్లాచెదురుగా ఉన్న పుస్తకాలూ, బట్టలూ నానా రభసగానూ ఉన్నవి. మాసిపోయిన దుప్పటి వేసిన పక్కా, నూనె మరకలు వోడుతూన్న తలగడా అసహ్యంగా ఉన్నవి. తన శరీరంనుంచి వెలువడే యవ్వనపు సౌరభాలూ, తలలో ముడుచుకొన్న మల్లెల సువాసనల గుబాళింపే లేనట్లయితే ఆ చెడువాసనల్ని భరించగలిగేదే కాదు!

'ఆకలి రుచి నెరుగదు!' 'నిద్ర సుఖమెరుగదు' అన్న వాటికి 'కామం కాని పనుల నెరుగదు!' అని కూడా జేర్చుకోవచ్చనే విషయం ఇందుమతికి ముందే- నా తలవెంట్రుక లంతమంది వనితలు నిశ్చయంగా రుజూ చేసే ఉన్నారు. తదనుగుణంగా వాతావరణం ఏదయినప్పటికీ ఇందుమతి కామోత్సవంలో ఉత్సాహంతో పాల్గొని రసాస్వాదనలో మైమరువ గలిగింది.

యవ్వనోద్రేకపు మొదటి పొంగులు చల్లారాక, ఆమెకు తాను ఎవరయిందీ ఏం జరిగిందీ, కర్తగా వచ్చి కర్మగా మారి పొందిన అనుభూతీ మొదలైనవి గుర్తు కొచ్చినవి. ఈ లోపల తన భర్తకు మెలుకువ వచ్చి ఉంటే! తాను శంకరం చేతులలో వాలిపోయినప్పటినుంచీ యిప్పటివరకూ ఎంతకాలం గడిచి ఉంటుందోనన్న జ్ఞానం కూడా పోయింది. ఉద్రేకంలో తెరమరుగున ఉన్న సిగ్గు, యిప్పుడే ఆమెను వెక్కిరిస్తోంది.

జరిగినదాన్ని జరక్కుండా చేయగల శక్తి యెవరికున్నది? అందుకని జరగవలసిన దాన్ని గూర్చే ఆమె మధన పడుతోంది.

"ఇక వెళతాను–" అన్నదామె, పమిటచెంగు వేలికి చుట్టుకుంటూ.

"అప్పుడేనా? ఇక్కడ నీకేం భయం లేదు. నా ఈ గదిని ఆనుకొని ఉన్న గది, సామాను గది. యీ చుట్టుపక్కల యెవ్వరూ లేరు..."

"వెళ్ళాలి!"

"రావటమూ నీ వంతే, పోవటమూ నీ వంతేనా?"

శంకరం కంఠస్వరంలో అధికారం ధ్వనిస్తోంది. ఒక్కసారి లొంగుతే చాలు – ఆడది మొగాడికి యెంత లోకువై పోతుంది!

"మా ఆయన మేల్కొన్నాడేమో?"

వాళ్ళ ఆయన నిద్ర ఆమె ఆధీనంలోనూ లేదు; తన ఆధీనంలోనూ లేదు. అదీగాక యీ ఇల్లాలికి, యిల్లుదాటి రావటం ఇదే మొదలు. అందుకని భయపడుతూండి ఉండొచ్చు. ఇప్పటికి యీ వ్యవహారం సురక్షితంగా జరిగిపోతే, ఆమెకు సహజం గానే మరింత ధైర్యం వస్తుంది. ఈ కారణాల వలన శంకరానికి ఆమె చెప్పిన వంక సబబని తోచింది.

అయితే రేపుకూడా ఆ 'భర్తగాడు!' ఎంతసేపు నిద్రపోతాడో తెలియదు: అందుకని అతను సుఖనిద్రలో ఉండటమనేదాన్ని తమ చేతుల్లో ఉంచుకోగలగటం అత్యవసరం. తాను చదువుతున్న వైద్యవిద్యను గూర్చి శంకరం జీవితంలో మొట్టమొదటిసారి నిజంగానే యెంతో గర్వించాడు.

"చూడు! మీ ఆయన పడుకోబొయ్యేముందు ఏమైనా తాగుతాడా?"

తెగతాగి తన భర్త వొళ్లు తెలియకుండా నిద్రిస్తూండి ఉంటాడనే వాదాన్ని శంకరం ప్రవేశపెట్టే ప్రయత్నం చేస్తున్నాడేమో ననిపించింది– ఇందుమతికి.

"ఆయన తాగుబోతేం కాదు!" అన్నదామె, రోషంతో.

"నేను ఆ ఉద్దేశ్యంతో అనలేదు. ఆయన రాత్రిపూట ఏదైనా పానీయం– అంటే పాలు, హార్లిక్సు లాటివి తాగుతారా?"

"పాలు తాగుతారు!"

శంకరం కుశాగ్రబుద్ధిని గమనించి తాను అన్న మాటలకు అతను వేరొక అర్థం తీసి ఉంటాడనే అనుమానం కలగగానే ఇందుమతి కాస్త సిగ్గుతో తల వొంచింది.

మొదటిరాత్రే ఆడపిల్లను ఏడిపిస్తే, మరి రాదేమోనని భయపడిన శంకరం యిదేమీ గమనించనట్లే వూరుకున్నాడు.

"అయితే రేపు మధ్యాహ్నం మూడింటికి మొండిగోడ దగ్గరకు రా. నిద్ర మందు మాత్రలు ఇస్తాను. రెండు మాత్రలు పాలలో కలిపి మీ ఆయనకు తాగించావంటే, తెల్లారేవరకూ లేస్తాడనే భయంలేదు..."

"ఏమన్నా ప్రమాదమేమో?"

"నేను మెడిసిన్ చదువుతున్నాను. ప్రమాదమయితే ఆ పద్ధతి చెపుతానా?"

"సరే- చూద్దాం!"

"చూడటం కాదు- అదొక్కటే సురక్షితమైన మంచి మార్గం!"

"అమ్మో!" అని హఠాత్తుగా ఎగిరిపడిందామె.

"ఏమిటీ?"

"ఏదో కుట్టింది..." అని ఆమె పిర్రమీద గోక్కుంది.

"నల్లి!" అన్నాడు శంకరం సాధారణ విషయమన్నట్లు.

"నల్లులు కూడానా?"

"అవి ఉండటం యెంత మంచిదో పిచ్చిపిల్లవు- నీ కింకా అర్థం కాలేదు. యీ నల్లులు మన రక్తం కాస్త ఆరగించినా, తెల్లవార్లూ మనం నిద్రపోకుండా రతి సౌఖ్యాన్ని అనుభవించేందుకు ఎలా సహకార సహాయాలను అందిస్తాయో నీకింకా తట్టలేదు. రా-ఇందూ! నల్లుల కారణంగా నాకు రాత్రులు నిద్రపట్టక కదా- నిన్ను గూర్చి తీవ్రంగా ఆలోచించి, యీ పథకం వేసి నిన్ను పట్టింది? మనం కామక్రీడల్లో అలసిపోయి తెల్లారేలోగా ఎవరి గూళ్ళకు వాళ్ళు జేరాలనే విషయం కూడా మరిచిపోయి ఆదమరిచి నిద్రపోకుండా యీ నల్లులు చిటుకూ చిటుకుమంటూ కుట్టి, విలువైన కాలాన్ని వృథా చేయకుండా తగిన హెచ్చరికలతో కట్టుబాట్లు చేస్తవి. రేపు రాత్రినుంచి నీకు బాగా తెలిసొస్తుందిలే!" అన్నాడు శంకరం.

"అబ్బ!" అన్నదామె, పక్కమీంచి ఒకడుగు పైకి లేచి రెండో పిర్రమీద గోక్కుంటూ. "యీ పాడు నల్లులతో యెలా వేగుతున్నారో!"

"వీటిని నల్లు లనకు; మన్మథుని వేడి, వాడి బాణాలు. మన గదిలో అవి కోకొల్లలు; పుట్టలు పుట్టలున్నయ్! మన మేలు కోరే యీ సన్నని జీవాలను అసహ్యించుకోకు-"

"నే వెళ్ళొస్తా-"

శంకరం కూడా లేచి, మొండిగోడ దగ్గిర మరోసారి ఇందుమతిని బిగియార కౌగలించుకొని, వేడిముద్దులు రెండు ప్రసాదించి "రేపు మూడింటికి నిద్రమాత్రల సీసా సంగతి మరిచిపోకు-" అని హెచ్చరించి, ఆమెకు వీడ్కోలు యిచ్చాడు.

ఇందుమతికి ఇప్పుడు యెక్కడలేని భయమూ పట్టుకుంది. అనుకోకుండానే తానెంత సాహసం చేసింది! తలుచుకుంటేనే కంపరం పుట్టిం దామెకు.

గది తలుపు దగ్గిర ఆయాసం తీర్చుకుంటూ ఒక్కక్షణం ఆగి, గదిలో యెలాటి అలికిడీ లేదని నిశ్చయంగా తెలుసుకొని, మడతలు చెరిగిన దుస్తుల్నీ, రేగిన తలనూ సరిజేసుకొని తనకు తానే ధైర్యం చెప్పుకొని, మెల్లిగా గొళ్ళెంతీసి, గదిలో ప్రవేశించి, చప్పుడు కాకుండా గడియవేసి, దొంగచాటుగా పాలు తాగిన పిల్లివలె అడుగులో అడుగు వేసుకుంటూ, మృదువుగా శయ్యమీద వాలింది- ఇందుమతి.

రెండు నిమిషాలపాటు గట్టిగా కళ్ళు మూసుకొని, ఆ తరువాత కళ్ళు తెరిచి పరిసరాల్ని పరికించి పరిశీలించిం దామె.

యెక్కడా యెలాటి మార్పూ కానరాలేదు. తాను చేసిన సాహసం విజయవంతమైంది! తన రేపటి కోరికల కలలు యీనాడే యీడేరినవి. తను కోరకుండానే తన సమస్య లన్నిటికీ విధి ఒక పరిష్కార మార్గాన్ని చూపింది. తనకు స్వర్గ సౌఖ్యమే కరతలామలకమైంది. తన యీ విజయానికి ఆమె లోలోన గర్వపడింది.

ఆమె ఒకసారి భర్తవైపు అసహ్యంతో చూసింది. ఈ భర్త అరసికుడవబట్టే కదా- తను పక్కదారులు పట్టవలసిన గతి పట్టింది?

ఏదైనా నేరం చేసిన వ్యక్తి ఎవరికంటా పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవటం సహజం. ఒకవేళ పట్టుపడితే సామాజిక చట్టాలూ, నైతిక చట్టాలూ తీవ్రంగా శిక్షిస్తవి. ఈ ప్రపంచంలో నేరాలు చేసి కూడా పట్టుబడని వ్యక్తి, రేపు దేవుని ఎదుట సంజాయిషీ చెప్పుకోవలసి ఉంటుందని పురాణాలు ఘోషిస్తూనే ఉన్నవి. ఆ 'పాపభీతి' మతంగా నూరి పోయబడింది కనుక, అంతరాత్మలో ఒకమూల అది ముల్లువలె కలుక్కు కలుక్కు మంటూ ఉంటుంది. ఐనా అది చచ్చాక జరిగే విషయం. అది కూడా వదిలెయ్యవచ్చు; ఇక ఇక్కడ పట్టుబడక పోవటం మాట కూడా నిజమే ఐనప్పటికీ- తనలో అంతరాత్మ ఉన్నది కనుక, తాను చేసిన నీతిమాలిన పని యితరు లెవ్వరి కంటా పడకపోయినా, తన కంట పడింది. కనుక తన పనుల్ని తనకు తానే నచ్చచెప్పుకోందే ముందుకు సాగటం మంచిది కాదు కదా!

అందుకని ఇందుమతి ఇప్పుడు తనకు తానుగా యీ వక్రగతిని అనుసరించటాన్ని సమర్థించుకోసాగింది.

సహజ వాంఛలు తీర్చుకోవటం మానవుని జన్మహక్కు; అందుకే కదా ప్రతి ఒక్కరూ తనకు అర్హత ఉన్నా, లేకున్నా ఏ విధంగానైనాసరే సుఖాన్ని పుంజుకుందామని ప్రయత్నించేది? ఇందుకు తార్కాణంగా- తనను పొందే అర్హతలేని యీ భర్త కేవలం తన స్తోమతుతో తన మెడలో మూడుముళ్లు వేసి తనను కట్టివేయలేదా? తనకు జరిగిన యీ అన్యాయాన్ని న్యాయంగా మార్చుకోవడం తప్పా?

మాతృత్వం స్త్రీకి జన్మహక్కు. అది తన భర్త ద్వారా ప్రాప్తమవలేదు. ఇలాటి పరిస్థితులలో కుంతీదేవి ఏం చేసింది? ఆమెకు అంటని పాపం తనకు అంటుతుందా? కాకపోతే ఆమెకు దుర్వాసుని వరం ఉండటంవలన, సరాసరి ఆ దేవతల్నే రప్పించుకొని, వారి ద్వారానే గర్భవతి అయింది. తనకు ఆ దేవతలు లభ్యపడరు గనుక, మొండిగోడవెనుక గది తీసుకొని ఉన్న శంకరమే గతయ్యాడు. 'మాతృత్వాన్ని పొందటం' అనే మహదాశయాన్ని లభ్యపరచుకోవటంలో, మరోమార్గం లేక అనుసరించిన విధానం తాలూకు పాపం అడుగంటుతుందేమో?

ఈ విధానాన్ని అనుసరించిన ఇల్లాళ్ళల్లో తను మొదటిదీ కాదు- చివరిదీ అవదు. సామాజిక చట్టాలకు కట్టుబడినట్లు నటించేందుకూ, నిజప్రవర్తనా విధానానికీ, భూమ్యాకాశాల మధ్య ఉన్నంత దూరం ఉండనే ఉన్నది. ఇతరులవలెనే తాను కూడా కేవలం సామాన్య మానవి కనుక, తనూ ఆ అడ్డతోవనే అనుసరించింది.

ఇదైనా తాత్కాలికమే కనుక అంతగా విచారించవలసిన పనిలేదు. త్వరలోనే తన యీ పొంగులు చల్లారుతే, తాను కూడా పవిత్రంగానే ఉండొచ్చు. లేదా ఏ దేవతలైనా కరుణించి తన భర్త దృష్టిని తనవైపు మళ్ళిస్తే- ఈ శంకరం కాదు కదా- అసలు శంకరు డొచ్చినా తాను లొంగదు!

ఈ విధమైన తర్కంతో ఇందుమతికి యెంతో మనశ్శాంతి లభించింది. తను చేసే పనిని తనకు తానుగా నచ్చ చెప్పుకున్నది. ఈ రాత్రి మరిగిన రుచిని మరల మరల పొందాలని ఉవ్విళ్ళూరింది. శంకరం ఎలాగూ నిద్రమాత్రలు ఇస్తాడు కనుక, వాటి ప్రయోగం ద్వారా గొప్ప రక్షణ ఏర్పడుతుంది. ఇక నిర్భయంగా ముందుకు ఉరికేందుకే ఆమె నడుం బిగించింది.

మొదటి మెట్టుమీదనుంచి జారిన స్త్రీ- యెన్ని మెట్లు జారాక, తాను యెంత కిందికి వచ్చిందో తెలుసుకోలేని అశక్తురాలే అవుతుందని ఇందుమతి మరోసారి రుజూ చేసింది.

❋ ❋ ❋

ఇవాళ కృష్ణపాద్యమి. గతరాత్రి పుచ్చపువ్వులాటి పండు వెన్నెల్లో తన ప్రియురాలికోసం శంకరం తెల్లగా తెల్లవారే వరకూ గస్తీ తిరిగాడు: కాని ఆమె రాలేదు.

సాహసించి ఆమె పడకగది గుమ్మంవరకూ వెళ్ళేందుకు అతనికి కాళ్ళాడలేదు. సరిగ్గా పక్షమన్నా పూర్తికాకుండానే తన ప్రేయసి వలపు, మలుపు తిరిగి ఉంటుందా అనే సందేహం అతనికి తీరలేదు.

ఈ ఉదయం కూడా ఆమె కనిపిస్తుందేమోనని శంకరం కాపలా కాచాడు; ఆమె జాడ తెలియలేదు. సాయంత్రం మాత్రం ఆమె దేవకన్యవలె సింగారించుకొని, వీధివాకిట్లో నిలబడి ఉంటే, శంకరం ఆమె వైపు చూసి చిరునవ్వు నవ్వాడు- కాని ఆమె మొహం చిట్లించుకొని నిష్క్రమించింది.

ఆ చంద్రోదయ సమయాన ఆమె దొడ్లో కనిపిస్తే శంకరం ఆమెతో మాట్లాడాలని యెంతో ప్రయత్నించాడు. కాని ఇందుమతి అతన్ని చాలా నిర్లక్ష్యంగా చూసింది. ఎవరో అపరిచిత వ్యక్తిని, ఉన్మాదిని చూసినట్లుగా ప్రవర్తించింది. అతనికి సూచనగానైనా జవాబివ్వలేదు సరికదా తల విదిలించి, అతి త్వరలోనే ఆ ప్రదేశాన్ని వీడింది.

తమమధ్య యెలాటి ప్రణయ కలహాలూ జరగలేదు. ఒకరి మాటమీద మరొకరికి యెంతో గురి ఉన్నది; చందమామ వలెనే రోజు రోజుకూ తమ ప్రణయం - మొన్నరాత్రివరకూ నాగా లేకుండా పెంపొంది లోతులకు పాతుకొనిపోయింది. తమ రహస్యం ఎవ్వరికీ తెలిసిన సూచనలుకూడా లేవు. మరి ఇంత హఠాత్తుగా ఇందుమతి- తనకు శరీరాన్నీ, హృదయాన్నీ మనస్ఫూర్తిగా సమర్పించి, ఇష్టానుసారంగా అనుభవించనిచ్చి ఎందుకని చేయిజారిపోయిందో శంకరానికి యెంత ఆలోచించినా అంతుబట్టలేదు.

❋ ❋ ❋

ఈ కథ చెప్పి వీర్యభేతాళుడు ఇలా అన్నాడు:

"రాజా! శంకరానికి పట్టుకున్న సందేహమే నాకూ పట్టుకున్నది. మాతృత్వాన్ని జన్మహక్కుగా భావించిన ఇందుమతి అది సంప్రాప్తమవటం వలన పరపురుషుడని శంకరాన్ని విసర్జించిందా? లేక ఆమెకు కామతృప్తి కలిగి మొహం మొత్తిందా? లేక ప్రతిరాత్రి పొందుతున్న దివ్యానుభూతే అని దానిపట్ల ఇందుమతికి విలువ తగ్గిందా? లేక ఆత్మ పరిశోధన చేసుకొని భారతస్త్రీకి శీలమే ప్రధానమని నమ్మి, తనను తాను దూషించుకొని, ఇకముందన్నా యీ అడ్డతోవల జోలికి పోరాదని నిశ్చయించుకున్నదా? లేక ఆమె ప్రార్థనలు విని, దేవతలే కరుణించి ఆమె భర్తకు తగినంత పుంసత్వాన్ని ప్రసాదించిన కారణంగా, ఆమె కామవాంఛలన్నీ రాజమార్గానే తీర్చుకునే అవకాశాలు లభ్యమైనవా? ప్రతిరాత్రీ శంకరం గదికి వెళ్ళటం వలన అతనికి అలుసై పోతానని ఇందుమతి బెట్టు చేయ దలిచిందా? యిలాగే బిగిసి ఉంటే- తన ప్రియుడు - తన వలెనే సాహసించి కనీసం తన పడకగది వరకూ వచ్చి తలుపు గీరటంలాటి పనులేమైనా

చేస్తే- దాన్నిబట్టి అతని ప్రణయం యెంత బలవత్తరమైందో పరీక్షించాలని ఆమె ఉద్దేశించిందా? లేక శంకరం పుంసత్వం కూడా క్షీణించిందా? ఇవన్నీకాక మరే ఇతర కారణమైనా వున్నదా?- ఇందులో ఆమె 'కీడు' శంకించిందా? లేక 'మేలు'నే ఆశించిందా? ఐనట్లయితే ఏది కీడు? ఏది మేలు? దాన్ని నిర్ణయించటం ఎలా?... దీనికి జవాబు తెలిసి ఉండికూడా చెప్పకపోయావో నీ తల వేయి వ్రక్కలవుతుంది!"

❋ ❋ ❋

విక్రమార్కుడు యీ విధంగా జవాబు చెప్పాడు:

"ఋతు స్నానమయాక మొదలైన యీ ప్రణయం ఒక పక్షం మాత్రమే జరిగింది కనుక, ఆలోగా ఆమె గర్భవతి ఐనప్పటికీ, మొట్టమొదటి సూచనలన్నా తెలిసే అవకాశం లేనందువల్ల ఆమె 'మాతృత్వ వాంఛ' ఈడేరిందని నిశ్చయంగా చెప్పలేము. ఒక్కరాత్రి అనుభవంతో కామతృప్తి కలిగినా, అప్పటికి మొహంమొత్తినా, కామం ఆకలిలాటి 'ఇన్‌స్టింక్ట్' కనుక, పగలు గడవగానే తిరిగి తలెత్తక తప్పదు; అందునా భర్త అరసికత్వంతో బాధపడుతూ, తెగించి, సాహసించి పరపురుషుణ్ని మరిగి, భర్తకు సంప్రాప్తమయే సహజ నిద్రకు తోడుగా నిద్ర మాత్రలు కృత్రిమంగా ప్రసాదించే గాఢనిద్ర రక్షణ నిస్తూండగా, నిశ్చింతగా తన ప్రియునితో ఆనందడోలికల్లో ఊగులాడే అవకాశాలు పెరిగినవి. ఇలాటి అద్భు తావకాశాలను దుర్వినియోగప రుచుకునేటంత మూర్ఖురాలు కాదు ఇందుమతి. ఆమె యవ్వనమూ, వాంఛలూ ఒకపక్షంలోనే తీరిపోయి ప్రణయమంటే మొహం మొత్తటం అసంభవం!

భారతస్త్రీకి శీలంమీద యెంత గౌరవాభిమానా లున్నప్పటికీ సామాజిక చట్టాలకన్న, ప్రకృతి చేసిన చట్టాలు తీవ్రమైనవీ బలవత్తరమైనవీ కావటం వల్ల వాటిదే పై చేయి. శీలాన్ని కోల్పోవటమనేది ఒక్కసారే- అదీ మొదటిసారి మాత్రమే జరుగుతుంది. ఆ తరువాత అది యెన్నిసార్లు దోచబడినా ఒకటే! అందుకని ఇందుమతి ఇలాటి ఆలోచనలనూ, ఊహలనూ మొట్టమొదటిసారి కాలు జారబొయ్యేముందు ఎదుర్కోగలదే కాని, ఆ తరువాత వాటి ప్రస్థావనే రాదు.

మానవులు చేసే పనుల్లో దేవతలు తలదూర్చుతారనేది కేవలం పుక్కిటి పురాణమే అవుతుంది. అందునా మానవునికి సాధ్యమై మానవుడే సాధించగలదాన్ని కూడా దేవతలు చేయాలనటం అసమర్థత మాత్రమే కాదు: మౌఢ్యం కూడాను. ఆమె భర్తకున్న పుంసత్వాన్ని హఠాత్తుగా పెంచటం దేవతకు ఒక పనా?

ప్రియుడు తనకోసం పడిగాపులు కాయాలనీ, అతనికి అలుసవకుండా బెట్టు చేద్దామనే ఊహ ఇందుమతికి ఇప్పుడు కలిగే అవకాశమే లేదు. మొగాడికి లొంగేవరకే ఆడదాని బెట్టుకు విలువ; ఆ తరువాత మెట్టు మెట్టు ఆ బెట్టు దిగజారవలసిందే!

అందునా పద్నాలుగు రాత్రులు విడువకుండా శంకరం గదికి వెళ్ళిన ఇందుమతి హఠాత్తుగా యీ బెట్టును ప్రవేశపెట్టవలసిన అవసరం ఏమిటి? అందువల్ల శంకరం వలెనే తాను కూడా ఆ దివ్యానుభూతికి దూరమై బాధపడవలసిందే కదా!

ఇక శంకరం యెలాటివాడో ఆమెకు పద్నాలుగు రాత్రుల అనుభవంలోనూ తెలిసిన విషయమే! అతని పుంసత్వం క్షీణించట మనేది కేవలం గతరాత్రే జరిగేది కాదు. క్రమంగా తగ్గుకుంటూ రావాలి కదా! మదించి ఉన్న బ్రహ్మచారి ఐన శంకరం పుంసత్వం ఒక పక్షంలోగానే నీరు కారిపోయి ఉంటుందంటే నమ్మదగ్గ విషయం కాదు. అన్నిటినీమించి స్త్రీగా తాను రెచ్చగొట్టి ప్రియునిలో మూలమూలల నక్కి ఉన్న పుంసత్వాన్ని ఆకర్షించి, పెంపొందించి, తనకు కావలసిన విధంగా మలచుకోవచ్చనే స్వల్ప విషయం తెలియని నంగనాచేం కాదు మన ఇందుమతి!

తన ప్రియుని ధైర్యసాహసాలుకూడా ఏమిటో ఆమెకు తెలుసు! మొండిగోడకు ఆవలివైపునే అతనికి స్థాన బలిమి కనుక, ఆ ప్రాంతాలకు వొచ్చిన తర్వాతే తనను స్వీకరించే రకం. ఐనా ధైర్యసాహసాల ప్రదర్శనకోసం ఇందుమతి శంకరాన్ని యెన్నిక చేయలేదు. మదవతిగా రూపొందిన తనను మదనుని నిశిత శరాలనుంచి కాపాడేందుకే అతన్ని ఆమె స్వీకరించింది. ఆ ఉద్దేశ్యం నెరవేరుతున్నంతకాలం, తదితర పరీక్షలుపెట్టి వృథా కాలయాపన చేయటం ఆమెకు అనవసరమే అవుతుంది కదా!

ఆమె రహస్యం బట్టబయలయే సూచనలు లేవని శంకరం అనుకోవచ్చుగాక! కాని ఆమె ఇంటిలో ఏం జరిగిందో మనం పరిశీలించవలసి ఉన్నది:

ప్రతిరాత్రీ నిద్రమాత్రలు వాడుతూండటంవల్ల క్రమంగా వాటి ప్రభావం ఆమె భర్త రామనాథం మీద తగ్గనారంభించింది. రామనాథం బొత్తిగా షండుడేం కాదు; మరీ ముసలితనము ముంచుకొచ్చినవాడూ కాదు. మరి అలాటివాడు రెండువారాలుగా రంభలాటి భార్యను పక్కన ఉంచుకొని, దాంపత్య ధర్మాన్నే మరిచిపోయాడంటే– అది నిద్రమాత్రల ప్రభావమే!

ఐతే ఆ నిద్రమాత్రల్ని తల దన్నిన మరో విరుద్ధశక్తి ఏదో వారి పడకటింటిలో ప్రవేశించి ఉండాలి. శంకరం గది నిండా పుట్టలు పుట్టలు నల్లు లున్నవని మనకు తెలుసు. ప్రతిరాత్రీ ఇందుమతినీ, శంకరాన్నీ అంటబొడుస్తూ– మన్మథుని నిశితశరాలై బాధించి బాధోపశమనానికి ఉత్సాహ ప్రోత్సాహాలను ఇస్తూనే ఉన్నవి. అవి తన కెంతో 'మేలు' కూరుస్తూన్నవని శంకరం అననే అన్నాడు. ఇందుమతి కూడా ఆ మాటలోని సత్యాన్ని స్వానుభవంలో గ్రహించే ఉండాలి.

ఐతే శంకరమూ, ఇందుమతీ ఒకరి యవ్వనాన్ని మరొకరు జుర్రుకుంటే నల్లుల దండులు ప్రేయసీ ప్రియుల యిద్దరి శరీరాలనూ అంటిబెట్టుకొని వారి వారి చిక్కని,

వెచ్చని రుధిరాన్ని పానం చేస్తూనే ఉన్నవి. శంకరానికి ఆమె అధరపాన సౌఖ్యం లభిస్తే, నల్లులకు ఆమె రుధిరపాన సౌఖ్యం లభించింది.

అంతేకాదు- యీ మన్మధక్రీడాభిరామాన్ని స్వయంగా తిలకించిన నల్లులు యెంత ఉద్రిక్తపడి ఉంటవో మనం ఊహించలేము. వాటి రక్తదాహం తీరాక, కామదాహం సహజంగానే తీర్చుకొని ఉంటవి, ఈ విధంగా వాటి సంతానం ఆ పద్నాలుగు రోజులలోనూ విపరీతంగా పెంపొందింది.

యిన్ని నల్లులకు కేవలం యిద్దరి మానవుల రక్తం ఎటూ చాలదు. సహజంగానే అవి ఆహారాన్వేషణలో కొత్త కొత్త ప్రదేశాలను కనుగొని తీరాలి. మంచి తిండీ, పుష్టికరమైన ఆహారమూ లభ్యమయే ఇందుమతి నిగనిగలాడే శరీరంలో తగినంత మధుర రుధిరమే గాక, చిక్కని కొవ్వు కూడా మహా రుచికరంగా ఉంటుంది కనుక, ఆమెను ఆశ్రయిస్తే పగలు కూడా ఆ నవయవ్వని శరీరాన్ని పిండుకోవొచ్చనే జ్ఞానం వెధవ నల్లులక్కూడా కలిగి ఉండాలి.

ఆమెను జేరేందుకు యెక్కువ వ్యవప్రయాసలూ, ఆలోచనలూ యెటూ అనవసరం. ఆమె ఇంటికి తిరిగిపొయ్యేప్పుడు ఆమె దుస్తుల్లో దాగొని, చీకటి కోణాల్లో నక్కి సరాసరి ఆమె పడకటింటిని జేరి, ఆమె మంచంలోనే స్థిరనివాసాన్ని - ఏర్పరచుకున్నది ఒక నల్లుల తండా.

ఇంతతో ఆగక ఆమె మంచానికే ఆన్చి ఉన్న రామనాధం మంచంలోకి కూడా ప్రవేశించి- ఉభయుల్నీ పిండుకు తినటం సాగించిన వా నల్లులు, ఐతే భర్త నిద్రించాక - ఇందుమతి ప్రియుని దర్శించబోవటంతో యీ నల్లు లన్నింటినీ రామనాధం ఒక్కడే భరించవలసి వొచ్చింది. మొద్దు నిద్రలో ఉన్న రామనాధాన్ని అవి నిర్దాక్షిణ్యంగా అంటబొడవసాగినవి.

కామకేళిలాటి సౌఖ్యాన్ని అనుభవించే సమయములో నల్లులు కుట్టినా బాధ అనిపించదు. కాని, సుఖనిద్రలో ఉన్న వ్యక్తి వాటిచేత అంటపొడవబడగా సహజంగానే వాటిని దూషిస్తూ నిద్రాభంగం పొందుతాడు గదా! యీ పొడవటం దినదిన ప్రవర్ధమానంగా సాగుతూండటంవలన రామనాధం సహజ నిద్రకే గాక, నిద్ర మాత్రలద్వారా సంప్రాప్తమైన కృత్రిమ నిద్రకు కూడా భంగం వాటిల్లింది. శవం కాకుండాలే కాని, నల్లులు అంటబొడుస్తూంటే మెలుకూ రాని దెవరికీ?

ఆ పున్నమినాటి రాత్రి యీ విధంగా నల్లుల దాడికి తట్టుకోలేని రామనాధం నిద్రకు దూరమయ్యాడు. అతను మేలుకొని ఉండగా గడపదాటేంత మూర్ఖురాలు కాదు- ఇందుమతి. వెధవ నల్లుల్ని తిట్టుకుంటూ రామనాధం మేకల్లే లేచి కూర్చుంటే ఇందుమతి నిస్సహాయురాలైంది.

గత పక్షంగా అతను ఆమెతో దాంపత్యాన్ని నిర్వహించలేదు. ఆ విధంగా పేరుకొని పోయిన కామం అతనిలో పడగ విప్పింది. పక్కనే నిజంగానే నిద్రరాక తన వలెనే అవస్థ పడుతూన్న రంభలాటి యిల్లాలు ఇందుమతి ఉండగా, కాలాన్ని వృథాచేయటం దేనికి?

ఇందుమతి కలలో కూడా తలచనంత పురుషత్వాన్ని రామనాథం ఆ రాత్రి ప్రదర్శించి ఉండాలి. తన భర్త ముందు శంకరం దిగదుడుపేనని ఆమెకు అనిపించి ఉండాలి. ఒకవేళ శంకరాన్నే ఆమె వాంఛిస్తూన్నప్పటికీ, యీ నల్లుల ముఠాలు తన భర్తను నిద్రపోనివ్వక, తనమీది దాడికి ప్రేరేపిస్తవి. నిజంగా ఆమెకు కావలసింది కూడా అదే కదా!

రామనాధమే గాక, యావత్ ప్రపంచమూ అసహ్యించుకొని ద్వేషించే నల్లులు యెంత గొప్ప మేలు చేసినవో ఇందుమతికే తెలుసు. తన కాపరం బూడిదలో పోసిన పన్నీ రవకుండా తన యవ్వనం అడవిగాచిన వెన్నె లవకుండా, తన దాంపత్యం ప్రతీ రాత్రీ మేలురకం తైలంలో తేలుతూ, దివ్యకాంతులీనే దివ్వెగా మారి, మకరధ్వజుని సేవలో ధన్యతపొంది మాతృత్వాన్ని పొందే సావకాశాలు కోకొల్లలుగా పెంపొందించిన ఘనత ఆ నల్లులదే ననీ ఆమె గ్రహించింది. కలకాలం యీ నల్లులు తమ శయ్యలలో స్థిరనివాసా లేర్పరచుకొని సుఖించాలని ఆమె హృదయపూర్వకంగా ఆశించే ఉండాలి.

కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చారన్నట్లు తన కామవాంఛలన్నీ గడప దాటకుండానే తీరుతూండబట్టి, ఇందుమతి శంకరాన్ని దూరతీరాలకు తరిమివేయ దలచింది. వాదోపవాదాలూ, సంభాషణలు కూడా అనవసరం కనుక, ఆమె అతన్ని నిర్లక్ష్యం చేసింది. మరో రెండు మూడు రాత్రులు తాను వొస్తాననే ఆశతో మొండిగోడకు ఆవల పారా కాచి తనంత తానే మానుకుంటాడని భావించి ఊరుకున్నది.

ఇక ఏది 'కీడు' ఏది 'మేలు' అనేదాన్ని స్థూలంగా ఎన్నటికీ నిర్ణయించలేము. ఏ నల్లులయితే శంకరానికి మేలు కూర్చినవో– ఆ నల్లులే ఇందుమతి శయనాగారంలో ప్రవేశించటం వలన, శంకరానికి ఆమె పొందు కరువైపోయింది. అదే విధంగా ఏ నల్లు ల్నయితే రామనాథం తిట్టుకున్నాడో, అతనికి తెలియకుండానే ఆ నల్లులు, అతనికి దివ్యసుఖాలను ఇవ్వటమే గాక, అతని దాంపత్యాన్ని కాపాడినవి. అందుకని ఆ యా సందర్భాలనుబట్టి 'కీడా?' 'మేలా?' అనేది నిర్ణయించబడాలి. ప్రతిదాంట్లోనూ యీ రెండూ మిళితమయే ఉంటవి. కనుక, ఆయా ఫలితాలను బట్టి కాని ఇదమిత్థమని తేల్చలేము!"

విక్రమార్కునికి మౌనభంగ మవటంతో వీర్యభేతాళుడు శవంతో సహా తుర్రున యెగిరి మర్రిచెట్టెక్కాడు.

– *ఫిబ్రవరి, 1966*